


ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం



# జనం ముచ్చట

శనివారం, సెప్టెంబర్ 12, 2026 | తెలంగాణ | పేజీలు : 4





మంత్రి పొంగులేటినీ...

# అసెంబ్లీ గేటు తాకనివ్వం

## గడల శ్రీనివాసరావు

తెలంగాణలో జనసేనను బలోపేతం చేస్తాం...

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచే రాష్ట్రవ్యాప్త కార్యాచరణ...

జనసేన శంఖారావం సభలో గడల శ్రీనివాసరావు...

2 లో..

ఖమ్మం సిటీ (జనం ముచ్చట): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని జనసేన పార్టీ నాయకుడు గడల శ్రీనివాసరావు తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్టం చేస్తూ, ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శకమైన ప్రజా పరిపాలన కోసం జనసేన పనిచేస్తుందని అన్నారు.ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఇప్పటికే పార్టీ సమావేశాలు నిర్వహించామని ఆయన వెల్లడించారు. ఈ నెల 13న ఖమ్మంలోని ఎంబీ గార్డెన్స్‌లో జనసేన శంఖారావం సభ నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ సభకు రెండు వేల మందికి పైగా జనసేన కార్యకర్తలు,రాష్ట్రస్థాయి నాయకులు హాజరుకానున్నారని చెప్పారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచే తెలంగాణ వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి అవసరమైన కార్యాచరణను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు.

**గ్రామస్థాయి నుంచి పార్టీ విస్తరణ....**

జనసేనను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళు న్నామని గడల శ్రీనివాసరావు తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ పార్టీని ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా

దళిత ద్రోహులకు బుద్ధి చెప్పేదాకా వదలం...

బీఆర్ఎస్, బీజేపీపై నిప్పులు చెరిగిన కాంగ్రెస్ నేతలు...





2 లో..




ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీ...

# దళిత గర్జన

బీఆర్ఎస్, బీజేపీ పార్టీల దళిత వ్యతిరేక, మనువాద విధానాలను ఖండిస్తూ ఖమ్మంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ నిరసన ర్యాలీ నిర్వహించాయి. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే చర్యలను సహించేది లేదని,దళిత ద్రోహులకు బుద్ధి చెప్పే వరకు పోరాటం కొనసాగిస్తామని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు.జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, ఖమ్మం అర్బన్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి ఆధ్వర్యంలో శుక్రవారం సంజీవరెడ్డి భవన్ నుంచి జెడ్పీ సెంటర్‌లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు....

ఖమ్మం (జనం ముచ్చట)సెప్టెంబర్ 12:

**బీఆర్ఎస్, బీజేపీపై తీవ్ర ఆరోపణలు....**

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు దళిత వ్యతిరేక, మనువాద విధానాలను అవలంబిస్తున్నాయని ఆరోపించారు. ఉత్తరాఖండ్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు,దళిత నాయకుడు మల్లికార్జున ఖర్గే కాలు పెట్టిన ప్రాంతాన్ని బీజేపీకి చెందిన వారు పసుపు నీళ్లతో శుద్ధి చేశారనే ఘటనను ప్రస్తావిస్తూ, ఆ ఘటన మరువక ముందే తెలంగాణలో బీఆర్ఎస్ కూడా అదే తరహా సంస్కృతిని కొనసాగిస్తోందని విమర్శించారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, ఇలాంటి విధానాలకు ప్రజాస్వామ్య పద్ధతిలో తగిన సమాధానం

(మొదటి పేజీ తరువాయి)

తీర్చిదిద్దుతామని అన్నారు.ప్రస్తుత పాలనపై విమర్శలు గుప్పించిన ఆయన..రాష్ట్రంలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ రైతులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కారం కాలేదని ఆరోపించారు.ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగాల్సిన అవసరం ఉందని, పారదర్శకమైన ప్రజా పరిపాలనే జనసేన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.....

**మంత్రి పొంగులేటిపై ఘాటు వ్యాఖ్యలు...**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై గడల శ్రీనివాసరావు తీవ్ర విమర్శలు చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పొంగులేటిని అసెంబ్లీ గేటు కూడా తాకనీయబోమని వ్యాఖ్యానించారు.గతంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తనను "శీనన్న అంటే నేనున్నా" అని చెప్పేవారని, ప్రస్తుతం "శీనన్న" అంటే హైదరాబాద్‌కే పరిమితమవుతున్నారని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు...రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలోని 10 నుంచి 15 నియోజకవర్గాల్లో జనసేన అభ్యర్థులను బరిలోకి దింపే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని గడల శ్రీనివాసరావు తెలిపారు. కేవలం అసెంబ్లీ ఎన్నికలకే పరిమితం కాకుండా ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లోనూ జనసేన పోటీ చేస్తుందని చెప్పారు,ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో పోటీ చేసేందుకు జనసేన

# మంత్రి పొంగులేటినీ...

# అసెంబ్లీ గేటు తాకనివ్వం



సిద్ధంగా ఉందని వెల్లడించారు. భవిష్యత్తులో జనసేన ప్రమేయం లేకుండా ఏ పార్టీ అధికారంలోకి రాలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు....

**అక్రమ కేసులతో జనసేన కార్యకర్తలను భయపెట్టలేరు....**

జనసేన కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని గడల శ్రీనివాసరావు ఆరోపించారు. కేసులు, బెదిరింపులతో జనసేన పార్టీని, కార్యకర్తలను భయపెట్టలేరని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై పోరాడేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. అంతే కాకుండా తెలుగుదేశం పార్టీ, భారతీయ జనతా పార్టీతో జనసేనకు అనుకూల సంబంధాలు ఉన్నాయని గడల శ్రీనివాసరావు తెలిపారు. అయితే భవిష్యత్‌లో ఈ రెండు పార్టీలతో రాజకీయ సంబంధాలు, పొత్తులపై నిర్ణయం జనసేన రాష్ట్ర నాయకత్వమే తీసుకుంటుందని స్పష్టం చేశారు....

**ఎమ్మెల్సీగా పట్టభద్రులు, నిరుద్యోగుల గొంతుకగా...**

తనను ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేట్ చేసినట్లు గడల శ్రీనివాసరావు వెల్లడించారు. అవకాశం లభిస్తే శాసనమండలిలో పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యలను బలంగా ప్రశ్నిస్తానని హామీ ఇచ్చారు. ఉద్యోగ అవకాశాలు లేక యువతతో పాటు వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్రంలో ప్రజల సమస్యలను ప్రధాన అజెండాగా చేసుకుని జనసేన ముందుకు సాగుతుందని, రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో పార్టీ కీలక ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతుందని గడల శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు,ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఖమ్మం జిల్లా ఇన్చార్జి మిరియాల రామకృష్ణతో పాటు జనసేన పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు....

# ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీ...

# దళిత గర్జన

(మొదటి పేజీ తరువాయి)



చెబుతారని అన్నారు...

**తాతా మధుసూదన్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి....**

శాసనమండలి సభ్యుడు తాతా మధుసూదన్ వ్యవహారశైలిపై కాంగ్రెస్ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్పై తాతా మధుసూదన్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. అంతేకాకుండా దళితులు నిరసన తెలిపిన ఎర్రవల్లి రోడ్లను పసుపు నీళ్లతో శుద్ధి చేయడం దళితుల ఆత్మగౌరవంపై దాడి కాదా? అని ప్రశ్నించారు. ఇది అంటరానితనాన్ని ప్రోత్సహించే చర్య కాదా అని నిలదీశారు.తాతా మధుసూదన్‌పై తక్షణమే చర్యలు తీసుకుని, ఆయన శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు....

**కాంగ్రెస్ ప్రజా పాలన చూసి ఓర్వలేకే కుట్రలు...**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు మంత్రివర్గ సభ్యులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు.ప్రజా సమస్యలను లోతుగా చర్చిస్తూ పరిష్కార మార్గాలను అన్వేషిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు ఉద్దేశపూర్వకంగా ఘర్షణ వాతావరణాన్ని సృష్టించి అలజడి, అశాంతి రేపాలని చూస్తున్నారని నూతి సత్యనారాయణ గౌడ్, నాగండ్ల దీపక్ చౌదరి, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆరోపించారు....

**బీఆర్ఎస్ పార్టీని ప్రజలు మరోసారి బొంద పెడతారు...**

బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని కాంగ్రెస్ నేతలు సూచించారు.లేకపోతే తెలంగాణ ప్రజలు మరోసారి రాజకీయంగా బొంద పెడతారని హెచ్చరించారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లోనే బీఆర్ఎస్, బీజేపీలకు ప్రజలు తగిన శాస్తి చేశారని అన్నారు. విజ్ఞత కలిగిన తెలంగాణ ప్రజలు ఆయా పార్టీల దళిత వ్యతిరేక చర్యలను నిశితంగా గమనిస్తున్నారని పేర్కొన్నారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చిన వెంటనే జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఖమ్మంకు తరలివచ్చి నిరసన ర్యాలీని విజయవంతం చేశారని నాయకులు తెలిపారు. కార్యక్రమానికి తరలివచ్చిన ప్రతి ఒక్కరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, సీనియర్ నాయకులు పులిపాటి వెంకయ్య, పట్టాభి, అనుబంధ సంఘాల అధ్యక్షులు దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, బొడ్డు బొందయ్య, మొక్క శేఖర్ గౌడ్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, విప్లవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.అలాగే జిల్లా, బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు,కార్యవర్గ సభ్యులు, ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీకి చెందిన వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...

# ఖమ్మం జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా సయ్యద్ ఆసిఫ్ నియామకం



ఖమ్మం(జనం ముచ్చట): ఖమ్మం జిల్లా నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) అధ్యక్షుడిగా సయ్యద్ ఆసిఫ్ నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగమైన ఎన్ఎస్‌యూఐలో ఆయనకు జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగిస్తూ జాతీయ, రాష్ట్ర నాయకత్వం నిర్ణయం తీసుకుంది.తనను ఖమ్మం జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా నియమించడంపై సయ్యద్ ఆసిఫ్ హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా జాతీయ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు వినోద్ జాఖర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు యాదవల్లి వెంకట స్వామి, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ రితీష్ రావులకు సయ్యద్ ఆసిఫ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు....

తనకు అప్పగించిన బాధ్యతను పూర్తి అంకితభావంతో నిర్వర్తిస్తానని సయ్యద్ ఆసిఫ్ తెలిపారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, వారి సమస్యలను ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

తనపై ఉంచిన నమ్మకాన్ని ఎల్లప్పుడూ నిలబెట్టుకుంటానని,ఎన్ఎస్‌యూఐను ఖమ్మం జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని సయ్యద్ ఆసిఫ్ తెలిపారు. విద్యార్థి సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, విద్యార్థుల తరఫున బలమైన గొంతుకగా నిలుస్తానని అన్నారు....అదే విధంగా తనకు అప్పగించిన ఈ బాధ్యతను నిజాయితీగా, సమర్థవంతంగా నిర్వర్తిస్తూ విద్యార్థుల సంక్షేమం కోసం పనిచేస్తానని సయ్యద్ ఆసిఫ్ స్పష్టం చేశారు. ఈ అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ పెద్దలు, ఎన్ఎస్‌యూఐ జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.సయ్యద్ ఆసిఫ్ నియామకం పట్ల ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.....

# ఖమ్మంలో బ్యాంకు ఉద్యోగుల భారీ ర్యాలీ

**ఖమ్మంలో బ్యాంకు ఉద్యోగుల ఒకరోజు సమ్మె...**

**5 రోజుల పని దినాలు అమలు చేయాలి..**

**పీఎల్ఐ అందరికీ వర్తింపజేయాలి...**

**ర్యాలీలో పాల్గొన్న 1000 మందికి పైగా బ్యాంకు ఉద్యోగులు...**

**సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు...**

ఖమ్మం సిటీ (జనం ముచ్చట):

బ్యాంకు ఉద్యోగులు, అధికారుల సమస్యలను పరిష్కరించడంతో పాటు తమ న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ యునైట్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో శు క్రవారం ఖమ్మం నగరంలో బ్యాంకు ఉద్యోగులు, అధికారులు ఒకరోజు సమ్మె నిర్వహించారు. సమ్మెలో భాగంగా నగరంలో భారీ ర్యాలీ చేపట్టి తమ డిమాండ్లను నినదించారు.వైరా రోడ్డులోని ఎస్‌బీఐ నుంచి ప్రారంభమైన ర్యాలీ ఇల్లందు క్రాస్‌రోడ్ మీదుగా సాగి తిరిగి ఎస్‌బీఐ వద్దకు చేరుకుంది. ఈ ర్యాలీలో 1000 మందికి పైగా బ్యాంకు ఉద్యోగులు, అధికారులు పాల్గొని తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐక్య ఉద్యమంతోనే తమ హక్కులను సాధించుకుంటామని నినదించారు....

ప్రధానంగా 5 రోజుల పని దినాలను అమలు చేయాలని, పీఎల్ఐ (పర్ఫార్మెన్స్ లింక్డ్ ఇన్సెంటివ్)ను ఉద్యోగులందరికీ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. బ్యాంకు ఉద్యోగులు, అధికారుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు ఆరోపించారు.ర్యాలీ అనంతరం ఎస్‌బీఐ ఎదుట నిర్వహించిన సభలో సీఐటీయూ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కళ్యాణం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి తుమ్మ విష్ణువర్ధన్, ఉపాధ్యక్షుడు ఎం.తిరుమ లాచార్యులు పాల్గొని బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు మద్దతు ప్రకటించారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్యాంకు ఉద్యోగులు, అధికారుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని







విమర్శించారు. 5 రోజుల పని దినాల విధానాన్ని అమలు చేసేందుకు రోజుకు అదనంగా 40 నిమిషాలు పనిచేస్తామని ఉద్యోగులు గతంలో అంగీకరించిన ప్పటికీ, ఇప్పటికీ దానిని అమలు చేయకపోవడం అన్యాయమన్నారు.

అలాగే పీఎల్ఐ విషయంలో వివక్ష చూపడం ద్వారా ఉద్యోగుల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడే పరిస్థితులను ప్రభుత్వం సృష్టి స్తోందని వారు ఆరోపించారు. ఉద్యోగుల మధ్య వివక్షకు తావులేకుండా అందరికీ సమానంగా ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బ్యాంకు ఉద్యోగులు, అధికారులు ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. కార్మికులు, ఉద్యోగుల న్యాయమైన పోరాటాలకు సీఐటీయూ ఎల్లవేళలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న సమ్మెకు సైతం సీఐటీయూ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకుని, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడం ద్వారా సమస్యలకు ముగింపు పలకాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంకు యూనియన్ల నాయకులు, ఇతర కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు....

## తెలంగాణ మున్నూరు కాపు JAC ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా

# యర్రా అప్పారావు

ఖమ్మం సిటీ (జనం ముచ్చట):

తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు జాయింట్ యాక్షన్ కమిటీ ఖమ్మం జిల్లా నూతన అధ్యక్షుడిగా శ్రీ యర్రా అప్పారావు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు జేఏసీ అధ్యక్షులు శ్రీ చందు జనార్ధన్ నియామక ఉత్తర్వులు ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా యర్రా అప్పారావును ఏకగ్రీవంగా ఎంపిక చేయడం పట్ల మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన పలువురు నాయకులు, ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన నాయకత్వంలో ఖమ్మం జిల్లాలో మున్నూరు కాపు జేఏసీని మరింత బలోపేతం చేసేందుకు కృషి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు...

అదే విధంగా సామాజిక వర్గ ఐక్యత,సంక్షేమం,హక్కుల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం జేఏసీ ఆధ్వర్యంలో మరింత



విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. జిల్లాలోని మున్నూరు కాపు సమాజాన్ని సంఘటితం చేస్తూ,వారి సమస్యలను సంబంధిత ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లడంలో నూతన జిల్లా అధ్యక్షుడు కీలకంగా వ్యవహరించాలని ఆకాంక్షించారు....

ఈ సందర్భంగా యర్రా అప్పారావుకు పలువురు నాయకులు, అభిమానులు, మున్నూరు కాపు జేఏసీ ప్రతినిధులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తనను ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా నియమించిన తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్ధన్‌కు యర్రా అప్పారావు కృతజ్ఞతలు తెలిపారు..తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జిల్లాలో జేఏసీని మరింత బలోపేతం చేయడానికి,మున్నూరు కాపు సామాజిక వర్గం అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.....

# చేయూత పెన్షన్ల వెరిఫికేషన్‌పై అధికారులతో సమావేశం

ఖమ్మం సిటీ (జనం ముచ్చట):



ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం చేయూత పెన్షన్ల వెరిఫికేషన్ ప్రక్రియపై సంబంధిత వెరిఫికేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 4,500 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరిగింది. వీటి వెరిఫికేషన్ కోసం ఇంజనీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ తదితర విభాగాలకు చెందిన అధికారులను వెరిఫికేషన్ అధికారులుగా నియమించారు.

వెరిఫికేషన్ అధికారులు తమకు కేటాయించిన డివిజన్లలో రేపటి నుంచి దరఖాస్తులను పరిశీలించి, అర్హతలను నిర్ధారించిన అనంతరం సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. చేయూత పెన్షన్ యాప్‌లో వెరిఫికేషన్ ప్రక్రియను ఏ విధంగా నిర్వహించాలి, వివరాలను ఎలా నమోదు చేసి అప్లోడ్ చేయాలనే అంశాలపై డీఆర్డీఓ అధికారులు డీసీ కేఎంసీ శ్రీనివాస్ రావు అధికారులకు అవగాహన కల్పించారు.

ఒంటరి మహిళలు, వృద్ధులు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు పెన్షన్ దరఖాస్తులను కూడా క్షుణ్ణంగా పరిశీలించి వెరిఫికేషన్ పూర్తి చేయాలని సూచించారు. సెప్టెంబర్ 25వ తేదీలోపు వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తిచేసి, సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో లు ఏ ఈ నరేంద్ర తేజ, యాకూబ్ నాయక్, యాకూబ్ అలీ,ాజు ఫణికుమార్, సీనియర్ అకౌంటెంట్ సతీష్, సీనియర్ అసిస్టెంట్లు రవి, సీనియర్ అసిస్టెంట్ రామచంద్రు, వెంకటలక్ష్మి, దుర్గా సాయికిరణ్, ప్రవీణ్ కుమార్, శశికుమార్ లను వెరిఫికేషన్ అధికారులుగా నియమించారు.

# సాగునీరు, విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

## మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, సెప్టెంబర్ 12 (జనం ముచ్చట): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీరు, విద్యుత్ సమస్యలతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు ఎంతో ఆశతో సాగు చేసిన పంటలకు అవసరమైన సమయంలో సాగునీరు, విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు.

ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్న విషయం ముందుగానే తెలిసినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి ముందస్తు ప్రణాళిక రూపొందించలేదని పువ్వాడ అజయ్‌కుమార్ ఆరోపించారు.. వాతావరణ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి సాగునీటి వనరుల నిర్వహణ, విద్యుత్ సరఫరా, పంటల పరిరక్షణకు చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. రైతుల సమస్యలపై బీఆర్ఎస్ ఎప్పటికప్పుడు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, రైతుల పక్షాన పోరాటాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని ఆయన అన్నారు. సాగునీరు అందక, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తడంతో పలు ప్రాంతాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.



అదే విధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, అసమర్థ పాలన కారణంగా పంట పొలాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఇప్పటికే సాగు కోసం రైతులు పెట్టుబడులు పెట్టి, పంటలపై ఆశలు పెట్టుకున్నారని, ప్రస్తుత పరిస్థితుల్లో పంటలు దెబ్బతింటే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితిని పరిశీలించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎక్కడెక్కడ సాగునీటి కొరత ఉందో గుర్తించి అత్యవసర ప్రాతిపదికన నీటిని అందించాలని, రైతులకు నిరంతరాయంగా అవసరమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. పంటలు ఎండిపోకుండా తక్షణ చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాల నిర్వహణకు సహకరించాలి

## శాంతి కమిటీల సమన్వయ సమావేశంలో పోలీస్ కమిషనర్

ఖమ్మం, సెప్టెంబర్ 12 (జనం ముచ్చట): వినాయక నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాన్ని శాంతి సామరస్యాన్ని కాపాడుకుంటూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పోలీసు కమిషనర్ సునీల్ దత్ సూచించారు. సెప్టెంబర్ 14 నుంచి ప్రారంభం కానున్న గణేశ్ నవరాత్రుల ఉత్సవాల కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పీస్ కమిటీలతో వినాయక నవరాత్రి విగ్రహాల ఏర్పాట్లు, బందోబస్తుపై పోలీసు కమిషనర్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... కమిషనరేట్ పరిధిలో జరుపుకొనే అతి పెద్ద ఉత్సవాల్లో ఒకటైన గణేష్ వేడుకలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మతపరమైన సామరస్యాన్ని కాపాడుతూ అన్ని వర్గాల ప్రజలు పరస్పరం సహకరించుకోవాలన్నారు.





ముందస్తు చర్యలు చేపడుతోందని తెలిపారు. గణేష్ శోభాయాత్రలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా నిర్వహించడానికి పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు అదేవిధంగా సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, తప్పుడు ప్రచారాన్ని నమ్మకుండా ప్రజలకు అవగాహన కల్పించడం. అనుమానాస్పద సమాచారం లేదా సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. గణేష్ నవరాత్రుల ఉత్సవాలు శాంతియుతంగా, సురక్షితంగా, భక్తిశ్రద్ధలతో జరిగేలా భద్రతకు సంబంధించి, పోలీసు, నగరపాలక సంస్థ , అగ్ని మాపక శాఖ, నీటి పారుదల శాఖ, వైద్య శాఖ, విద్యుత్, రవాణా తదితర శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి సమన్వయంగా పనిచేస్తూ, శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు సజావుగా జరుపుకునేలా పోలీసు శాఖ అన్ని చేస్తున్నట్లు తెలిపారు. శాంతి కమిటీ సభ్యులు పోలీసులు సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. వినాయక విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం సమయంలో నిర్ణయించిన మార్గాలు, సమయాలను తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. మతపరమైన సామరస్యాన్ని కాపాడుతూ అన్ని వర్గాల ప్రజలు పరస్పరం సహకరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ మోహన్ బాబు, బాలకృష్ణ భానుప్రకాష్ పాల్గొన్నారు.

# పారంపర్య వైద్యానికి ప్రభుత్వ గుర్తింపునివ్వాలి

- పూర్వ వైభవం తీసుక రావాలి.
- పారం పర్య వైద్య మహా సంఘం అభ్యర్థన
- సదస్సు వివరాలు వెల్లడించిన సంఘం గౌరవ సలహాదారులు రామడుగు వీరభద్రాచారి

ఖమ్మం, సెప్టెంబర్ 12 (జనం ముచ్చట):




పారం పర్య వైద్యానికి ప్రభుత్వం గుర్తింపు నివ్వాలని పారంపర్య వైద్య మహా సంఘం డిమాండ్ చేసింది. ఈ నెల 8,9,10 తేదీల్లో భద్రాచలంలో అఖిల భారత భక్త మార్కండేయ పద్మశాలి ల నిత్య అన్నదాన సత్రంలో పారం పర్య వైద్య మహా సంఘం ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ మేరకు సదస్సు వివరాలను సంఘం గౌరవ సలహాదారులు రామడుగు వీరభద్రాచారి శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు . ఈ సదస్సుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్గఢ్, బీహార్,కేరళ, కర్ణాటక, ఒరిస్సా, తమిళనాడు తదితర రాష్ట్రాల నుండి పారం పర్య వైద్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సదస్సులో భారతీయ సనాతన ఆయుర్వేద సిద్ధ వైద్యం, వైద్య విధానాలు , వైద్య గ్రంథాలు , దేశమంతటా వేల సంవత్సరాల నుండి విస్తరించి ఉన్న మన దేశ వారసత్వ సంపదకు మనమంతా వారసులమేనన్నారు. మన వైద్యాన్ని మనం పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. మన పారం పర్య వైద్యానికి ప్రభుత్వం నుండి తగిన గుర్తింపు ను సాధించేందుకు ఈ పారం పర్య మహా సంఘం ముందుకు సాగుతున్నట్లు పలువురు వక్తలు ఉద్ఘాటించినట్లు తెలిపారు . ఈ సదస్సుకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. సంఘం గౌరవ సలహాదారు రామడుగు వీరభద్రాచారి స్వయంగా తయారు చేసిన జీవ గడియారం (బయో క్లాక్)ను శివక్షేత్ర పీఠాధిపతులు శివ స్వామీజీ చేతుల మీదుగా ఆయురారోగ్య ప్రదాత అయిన శ్రీ ధన్వంతరీ భగవానుడి కాంస్య విగ్రహాన్ని బహుకరిస్తూ అభినందించి ఆశీర్వదించినట్లు తెలిపారు. తెలంగాణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దొంత యాత్రి మహర్షి, ఏపీ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎల్ శ్రీనివాసులు, సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ప్రముఖ పుత్తూరు సెల్య వైద్యులు చంద్రశేఖర రాజు, వైద్య రత్న, అడవిదేవుడు జమాల్ ఖాన్, యోగి శ్రీ సిద్ధ రామయ్య, మెడిటన్ ప్రొఫెసర్ టీడీయూ బెంగుళూరు హరిరామ మూర్తి, గౌరవ అధ్యక్షులు సర్దన రమేష్, గౌరవ సలహాదారులు దాడే వెంకట్రావ్ , ఉపాధ్యక్షులు కామంచి శ్రీనివాస్, భాను ప్రసాద్, కోశాధికారి దుర్గా. రాణి, ఉప కోశాధికారి అరుణాజ్ సహాయ కార్యదర్శులు రాజయ్య, రామకృష్ణయ్య, వెంకటేశ్వర రెడ్డి, వహీద్ అలీ, పద్మారావు, మోహన్ , రవీందర్, ఆనందం, శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొని అభినందించారు. ఈ జీవ గడియారం ప్రాముఖ్యత : శరీరంలోని త్రి దోషాలైనా వాత, పిత్త, కఫం సమతుల్యతపై మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. ఈ ముడు దోషాలు ఏ మాత్రం అసమ తుల్యతకు గురైనా రోగాల బారిన పడతామన్నారు. ఈ జీవ గడియారం ఏ సమయంలో ఏ పని చేయాలనేటువంటి దినచర్యను, ఆయా సమయాలలో వాత , పిత్త, కఫాల దోషాలను తెలుపుతుందన్నారు. ఈ జీవ గడియారం నిరంతరం దినచర్య తో పాటు మనకు క్రమశిక్షణ నేర్పుతుందనీ వివరించారు.

# నేడు (శనివారం) జాతీయ లోక్ అదాలత్ నిర్వహణ

## జిల్లా న్యాయాధికారి సేవా సంస్థ చైర్మన్ నాగరాజు.

ఖమ్మం, సెప్టెంబర్ 12 (జనం ముచ్చట): నేడు (శనివారం) జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయాధికారి సేవా సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

శనివారం ఉదయం 10.00 గంటలకు ఖమ్మం న్యాయ సేవా సదన్ నందు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ ను రాజీ పడదగిన కేసులను పరిష్కరించుకోవచ్చని జిల్లా న్యాయాధికారి సేవా సంస్థ చైర్మన్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.